అభివృద్ధిని అడ్డుకునేందుకే దుష్ప్రచారం

- గుంట నక్కల విమర్శలకు, పచ్చమీడియా పిచ్చిరాతలకు ప్రజలే బుద్ధి చెబుతారు
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి నియోజకవర్గానికి సముచితమైన స్థానాన్ని కల్పించే విధంగా అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ఈర్ష్య, అసూయలతో దగాకోరు పార్టీలు, గుంట నక్కల విమర్శలకు, మీడియా ముసుగులో దుర్మార్గమైన విషపు రాతలకు ప్రజలే బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. పట్టణంలోని 37వ వార్డులో ఎమ్మెల్యే శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గడిచిన నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. వారికి చేకూర్చిన లబ్ధి పథకాలు వివరాలతో కూడిన బుక్‌లెట్లను ఎమ్మెల్యే అందజేశారు. పలుచోట్ల ప్రజలతో ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014–19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నాయకులు బీద రవిచంద్ర, మాలేపాటి సుబ్బానాయుడు కావలి నియోజకవర్గాన్ని దోపిడీ చేశారన్నారు. కావలి సమీపంలో ఉన్న తెట్టు నుంచి నెల్లూరు సమీపంలో పడుగుపాడు వరకు కొత్తగా నిర్మించిన మూడో రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం కొన్ని లక్షల క్యూబిక్ మీటర్లు గ్రావెల్‌ను టీడీపీ నాయకులే తరలించి రూ.వందల కోట్లు అక్రమార్జనకు పాల్పడ్డారని గుర్తు చేశారు. వారి గ్రావెల్ దందాతో కావలి నియోజకవర్గంలో చెరువులు, ప్రభుత్వ భూములు గుంతలుగా మారిపోయాయన్నారు. ప్రజలు తమ ఇంటి నిర్మాణాలకు, ప్రభుత్వం నిర్మించే రోడ్లకు, జగనన్న కాలనీలకు ఆ లోయల్లోనే వెళ్లి అడుగు బొడుగు ఉన్న గ్రావెల్‌ను తరలిస్తున్నారని తెలిపారు. అయితే టీడీపీ నాయకులు గ్రావెల్ లూటీ ఏర్పడిన లోయలను తమ వల్ల ఏర్పడినట్లుగా టీడీపీ నాయకులు, వారికి తోకలుగా కారు కూతలు కూస్తున్నారని మండిపడ్డారు. వారికి వంత పాడుతూ పచ్చ మీడియా విషాన్ని చిమ్ముతూ దుర్మార్గమైన రాతలు రాస్తోందన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలే వీరికి సరైన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. రానున్న ఐదేళ్ల కాలంలో కావలి నియోజకవర్గ స్వరూపమే సంపూర్ణంగా మారిపోయి, ప్రజలు శాశ్వతమైన ఉపాధి, ఉద్యోగావకాశాలతో పాటు భూములకు, స్థలాలకు అనూహ్యమైన ధరలు వస్తాయన్నారు. దీని వల్ల నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరి జీవితాల్లో సరికొత్త వెలుగులు రావడం తథ్యమన్నారు. అందుకే టీడీపీ నాయకులు, వారికి మద్దతు ఇచ్చే ఇతర వ్యక్తులు, మీడియా ముసుగులో ఉన్న దుర్మార్గులు పలు రకాలుగా విష ప్రచారాలు చేసి అభివృద్ధి నిలిచిపోయేందుకు కుట్రలు చేస్తున్నారని చెప్పారు. తుమ్మలపెంట రోడ్డును నిర్మించకుండా టీడీపీ నాయకులు కాంట్రాక్టర్‌తో పనులు చేయించకుండా కుట్రలు చేశారని, మత్స్యకారుల ఘోష్ఠ టీడీపీ నాయకులకు తప్పని సరిగా తగులుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు, కుందుర్తి శ్రీనివాసులు, కనమర్లపూడి వెంకట నారాయణ, దామిశెట్టి సుధీర్ నాయుడు, పొనుగోటి అనురాధ, పందిటి కామరాజు, వడ్లమూడి వెంకటేశ్వర్లు, నందనవనం సీతామహాలక్ష్మి, చంద్ర, సురేష్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



అధికారులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

దుత్తలూరు: నియోజకవర్గంలో ఏవైనా అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉంటే పనులు వేగవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం దుత్తలూరులోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల మండల స్థాయి అధికారులు, వైఎస్సార్‌సీపీకి చెందిన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. హౌసింగ్, ఉపాధి హామీ, పంచాయతీ రాజ్, ఎలక్ట్రిసిటీ, తదితర శాఖలపై సమీక్ష నిర్వహించి అభివృద్ధి పనుల తీరు తెన్నులను తెలుసుకున్నారు. అభివృద్ధి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఉదయగిరి నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందేలా చూడాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తెచ్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. అధికారులు సమన్వయంతో పని చేసి నియోజకవర్గాన్ని జిల్లాలో మొదటి స్థానంలో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, పలు మండలాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నేత్రదానంతో అంధులకు వెలుగునిద్దాం

– డాక్టర్ ఎం.శార్వాణి



మాట్లాడుతున్న జిల్లా అంధత్వ నివారణ అధికారిణి డాక్టర్ శార్వాణి

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయడం ద్వారా చీకట్లో మగ్గుతున్న అంధులకు వెలుగునిద్దామని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజరు డాక్టర్ శార్వాణి అన్నారు. ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రిలో 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఒక వ్యక్తి మరణించినా కూడా ఇద్దరు జీవితాలకు వెలుగునింపే మహత్తర పుణ్య కార్యక్రమం నేత్రదానం అని తెలిపారు. నేత్రదానాన్ని కుటుంబ సంప్రదాయంగా మార్చుకుందామన్నారు. నానాటికి పెరుగుతున్న యాంత్రిక జీవనంతో సమాజంలో చూపు మందగిస్తుందని నేత్రదానంపై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం మాట్లాడుతూ మనిషి మరణానంతరం మాత్రమే నేత్రదానం చేయాల్సి ఉంటుందని, మరణం సంభవించిన ఆరు లేదా ఎనిమిది గంటల్లోపు నేత్రదానం చేయాల్సి ఉంటుందన్నారు. ఏ వయసు వారైనా, కంటి అద్దాలు ధరించే వారైనా, మధుమేహం, అధిక రక్తపోటు కలవారైనా మరణానంతరం తమ నేత్రాలను దానం చేయొచ్చన్నారు. ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రి ఆర్ఎంఓ ఉషాసుందరి మాట్లాడుతూ ఒక మనిషి చేసే నేత్రదానం ఇద్దరు అంధులకు దృష్టి ప్రసాదిస్తుందన్నారు. నేత్రదానానికి సమీప బంధువు ఆమోదం తప్పనిసరన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నర్సింగ్ సూపరింటెండెంట్, హెడ్ నర్సెస్, స్టాఫ్ నర్సులు, సిబ్బందిపాల్గొన్నారు.

మిరప నారుమడిలో విజిలెన్స్ తనిఖీ



మర్రిపాడులోని మిరప నారుమడిని తనిఖీ చేస్తున్న జిల్లా విజిలెన్స్ అధికారులు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ఉద్యాన శాఖ పర్యవేక్షణలో మర్రిపాడులో పెంచుతున్న మిరప నారుమడిని జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పెంచలరెడ్డి తన బృందంతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. నర్సరీ నిర్వాహకులు రైతులకు చెప్పిన సమయంలోగా నాణ్యతా ప్రమాణాలు పాటించిన నారును అందించేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా నారుమడికి సంబంధించిన వివరాలను బోర్డుపై ప్రదర్శించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించి రైతులకు నాణ్యమైన నారు సరఫరా చేయాలని లేని పక్షంలో జరిమానా విధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అయన వెంట జిల్లా విజిలెన్స్ ఏఓ వేణుగోపాల్, ఆత్మకూరు ఉద్యానశాఖ అధికారి రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా పాలపొంగళ్లు



ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం కంపసముద్రంలో శ్రీకృష్ణ మందిరం వద్ద మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పొంగళ్లు పెట్టారు. శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని రెండో రోజైన శుక్రవారం స్వామి, అమ్మవార్ల మూలమూర్తులను మేళతాళాలతో ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. కంపసముద్రంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ప్రత్యేకంగా పూజించిన వంట సామగ్రి బుట్టలను శిరస్సుపై పెట్టుకుని శ్రీకృష్ణ మందిరం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి సమర్పించారు.

శ్రీకృష్ణ పరమాత్ముడికి ప్రత్యేక పూజలు

ఆత్మకూరు మండలంలోని బట్టేపాడులో కొలువై ఉన్న శ్రీకృష్ణ పరమాత్ముడికి శుక్రవారం భక్తులు పూజలు చేశారు. ప్రబోధసేవా సమితి త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచురణలను భక్తులకు పంచి పెట్టారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

ఉదయగిరి: మండలంలోని సున్నంవారిచింతలలో మూడు రోజులుగా జరుగుతున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహించారు. గురువారం రాత్రి స్వామి వారిని ప్రత్యేక వాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం ఉదయం చిన్నారులు, యువకులు ఉట్టి కొట్టే ఉత్సవాన్ని నిర్వహించారు.

గువ్వాడిలో..

వరికుంటపాడు: మండలంలోని గువ్వాడిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. భక్తులు శ్రీకృష్ణుడిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. చిన్నారులు చిన్నికృష్ణులు, గోపికలుగా అలరించారు. అనంతరం ఉట్టి మహోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం చేశారు. భక్తులకు భగవద్గీత పంపిణీ చేశారు.

దుత్తలూరులో..

దుత్తలూరు: దుత్తలూరు సెంటర్‌లో ప్రబోధ సేవాసమితి, ఇందు జ్ఞానవేదిక ఆధ్వర్యంలో మూడు రోజులుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

నూతన పింఛన్లు అందజేత



పింఛన్ అందజేస్తున్న కౌన్సిలర్ మొలబంటి రాజశేఖర్

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపాలిటీ 1వ వార్డు నరసాపురం, ముస్తాపురం ప్రాంతాల్లో మంజూరైన నూతన పింఛన్లను కౌన్సిలర్ మొలబండి రాజశేఖర్ శుక్రవారం సచివాలయ వలంటీర్లతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. పలువురు గిరిజనులు ఎలాంటి సిఫార్సులు లేకుండా తమ అర్హతను గుర్తించి పింఛన్లు నేరుగా ఇంటికే అందజేయడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రేపు మండల సాంఘీక్

ఆత్మకూరు: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పడి 98 సంవత్సరాలైన సందర్భంగా మండల సాంఘీక్ కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ నగర కార్యవాహక్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 98 ఏళ్లుగా దేశంలో దేశభక్తి క్రమశిక్షణ, ధర్మంపై శ్రద్ధను పెంపొందించడంలో విశేష కృషి చేస్తుందని, ప్రపంచంలోనే అతి పెద్ద స్వచ్ఛంద, సాంస్కృతిక జాతీయ సంస్థగా పేరుపొందిందన్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు రాఘవేంద్ర ఫంక్షన్ హాల్లో మండల సాంఘీక్, అల్పకాలిన విస్తారక్ యోజన కార్యక్రమాలు ఆత్మకూరు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు, ముఖ్య వక్తగా జిల్లా కార్యప్రచారక్ హనుమంత్ పాల్గొంటారని, కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి



పాఠశాలలో వర్క్ బుక్‌లు పరిశీలిస్తున్న ఎంఈఓ-2 ప్రభాకర్‌రెడ్డి

చేజర్ల (సోమశిల): విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ, పరిసరా పరిశుభ్రతను తెలిపాలని అనంతసాగరం ఎంఈఓ-2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అనంతసాగరం మండలంలోని సంజీవ్‌నగర్ ప్రాథమిక పాఠశాలను ఆయన విజిట్ చేశారు. పిల్లల వర్క్ బుక్స్, రికార్డులు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరు బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాపిశెట్టి నర్సింహులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

నాడు-నేడు పనుల్లో నాణ్యత పాటించాలి



పనులు పరిశీలిస్తున్న ఎంఈఓ మస్తాన్‌వలి

ఉదయగిరి: మండలంలో మనబడి నాడు–నేడు ద్వారా పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంఈఓ మస్తాన్‌వలి అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని దాసరపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నాడు–నేడు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ పనుల్లో నాణ్యమైన వస్తువులు వాడాలన్నారు. కాంక్రీట్ పనులు జరిగి ఉంటే వాటర్ క్యూరింగ్ చేయాలన్నారు. నిర్మాణాలకు సంబంధించిన రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు.

సంక్షేమంతో జనరంజక పాలన



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మేకపాటి రాజారెడ్డి

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కలిగిరి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ జనరంజక పాలన అందిస్తున్నారని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. కావలిముస్తాపురం పంచాయతీ దంటుపాళెం, కొత్తపేట, పాతానాపురం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. దంటుపాళెంలో మాతమ్మతల్లి ఆలయం, కొత్తపేటలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మేకపాటి గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయాలు, వలంటీర్ల ఏర్పాటుతో ప్రజల వద్దకు పాలనను చేరువ చేశారన్నారు. కుల, మతాలు, పార్టీలకు అతీతంగా అతీతంగా అందిస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ గెలుపునకు నాందిగా నిలుస్తాయన్నారు. సచివాలయానికి కేటాయించే నిధులతో ప్రాధాన్యత క్రమంలో గ్రామాల్లో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు కొనసాగాలన్నా, రాష్ట్రం అన్ని రంగాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలన్నా 2024 ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటానని, ఆదరించి రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, పీఏసీఎస్ చైర్మన్లు ములకా శ్రీనివాసులురెడ్డి, దగ్గుమాటి ఆదిశేషారెడ్డి, స్థానిక నాయకులు మాలేపాటి వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, చిన్నసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మేలు రకాల విత్తనాలతో దిగుబడులు



మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

సంగం: మేలు రకాల విత్తనాలతో మంచి దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం నెల్లూరు వ్యవసాయాధికారి ఈ.శైలజకుమారి చెప్పారు. సంగంలో శుక్రవారం ఆత్మ ఆధ్వర్యంలో రైతుకు మండల స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాబోయే రబీ సీజన్‌లో ఎన్ఎల్ఆర్–34449, ఎన్ఎల్ఆర్–3354, ఎన్ఎల్ఆర్–40024, ఎన్ఎల్ఆర్–3238, ఎన్ఎల్ఆర్–40054, బీపీటీ–5204, ఆర్ఎన్ఆర్–15048 రకాలను సాగు చేసుకోవాలన్నారు. విత్తనం కొన్న వెంటనే మొలక శాతం నిర్ధారించుకోవాలని, విత్తనం విత్తే సమయంలో విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.కిరణ్‌కుమార్‌రెడ్డి వేరుశనగ పంటలో ఎరువులు, కలుపు యాజమాన్య పద్ధతులను వివరించారు. రైతులు ద్రవరూప జీవన ఎరువులు తప్పకుండా వాడుకోవాలన్నారు. వేరుశనగలో అధిక దిగుబడి కోసం ట్యాగ్–24 బదులు టీసీజీఎస్–1694 రకాన్ని సాగు చేసుకోవాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి బీ శ్రీనివాస చక్రవర్తి మట్టి పరీక్షలు కచ్చితంగా చేయించుకోవాలని, వాటి ఫలితాల ఆధారంగా ఎరువులు మోతాదు నిర్ణయించుకుని ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. మట్టి నమూనా సేకరణ పద్ధతి, పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యత, వాటి ఆవశ్యకతను సంగం ఏఓ ఎస్.శ్రీహరి అన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

జీవవైవిధ్యాలను పరిరక్షించుకోవాలి



మరియ కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపల్

ఉదయగిరి: సమాజంలో మానవ మనుగడ కొనసాగాలంటే జీవవైవిధ్యాలను పరిరక్షించుకోవాలని రాష్ట్ర జీవవైవిధ్య సంఘ అధ్యక్షుడు డాక్టర్ బండి మరియ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ఉదయగిరిలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ వజ్రోత్సవాల్లో భాగంగా నిర్వహించిన జీవవైవిధ్య చట్టం–2002పై ఆవశ్యకతను వివరించారు. ఆయన మాట్లాడుతూ ఎప్పటినుంచో మానవుడు ప్రకృతి జీవ సంపదను సర్వనాశనం చేస్తూ తన ఉనికికే ప్రమాదాన్ని తెచ్చుకుంటున్నాడన్నారు. ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో మానవ మనుగడ కష్టమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ జీవరాశులను, వృక్ష సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఆయన్ను అన్నిశాఖల అధ్యాపకులు, అధిపతులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కరుణసాగర్, ఏఓ డాక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఇళ్లు సద్వినియోగం చేసుకోవాలి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్

ఆత్మకూరురూరల్: పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. మండలంలోని మహిమలూరులో జగనన్న లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న గృహాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ఇళ్లు మంజూరైన వారు ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే కాంట్రాక్టర్ల ద్వారా వారికి ఇళ్లు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సకాలంలో బిల్లులు చేయాలని హౌసింగ్ ఏఈ శరత్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి పల్లవోలు భాస్కర్, లబ్ధిదారులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మూవ్‌మెంట్ రిజిస్టర్ నిర్వహించండి



మట్టి సేకరిస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి

వరికుంటపాడు: సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లేటప్పుడు మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేసి వెళ్లాలని ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి చెప్పారు. మండలంలోని గణేశ్వరపురం సచివాలయాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలందించారు. ఆమె మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పని చేస్తూ కార్యాలయానికి వచ్చే కార్యార్థులకు సకాలంలో పనులు చేసి పెట్టాలన్నారు. అనంతరం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నామట్టి–నాదేశం కార్యక్రమంలో భాగంగా పంచాయతీ నుంచి మట్టి సేకకరించారు.

వలంటీర్లు నిబద్ధతతో పనిచేయాలి



వలంటీర్లకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్

అనుమసముద్రంపేట: గ్రామ వలంటీర్లు నిబద్ధతతో పనిచేయాలని ఎంపీడీఓ భాస్కర్ అన్నా రు. శుక్రవారం మండలంలోని పలు సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఏఎస్‌పేటలో ఖాళీగా ఉన్న రెండు పోస్టులకు ముగ్గురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. త్వరలోనే ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇంటర్వ్యూలలో ఏఓ శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ఆత్మకూరురూరల్: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీరు పోస్టులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ మాట్లాడుతూ మహిమలూరులో 2, వాశిలి, కరటంపాడులో ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్న వలంటీరు పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. ఎంపికైన వారిని ఈ నెల 11వ తేదీ నుంచి విధుల్లో నియమిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల (సోమశిల): అనంతసాగరంలో ఖాళీగా ఐదు వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఏ మధుసూదన్‌రావు గ్రామ సచివాలయ వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఐదు పోస్టులకు 14 మంది దరఖాస్తు చేసుకోగా 10 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారన్నారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలను తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

బీఎల్వోలు బాధ్యతగా పనిచేయాలి



సిబ్బందితో సమీక్షిస్తున్న సువర్ణమ్మ

ఉదయగిరి: ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి బూత్‌స్థాయి అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి సువర్ణమ్మ అన్నారు. ఆమె శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ సిబ్బంది సమగ్ర ఓటరు జాబితాకు సహకరించాలన్నారు. ప్రతి రోజూ చేసిన ఎన్నికల పనికి సంబంధించిన నివేదికలు సకాలంలో అందజేయాలన్నారు. చేర్పులు, మార్పులు, తొలగింపులు పక్కాగా నిర్వహించాలన్నారు. ఒక కుటుంబంలోని ఓట్లన్నీ ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్వో జగదీష్‌బాబు పాల్గొన్నారు.

ఐటీఐ ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో 2023–24 విద్యా సంవత్సరానికి ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్‌ల్లో నాల్గో విడత ఖాళీలను భర్తీ చేసేందుకు 10వ తరగతి పాసై అర్హత కలిగిన వారి వద్ద దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ షేక్ గౌస్‌బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన వారు ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 20వ తేదీ ఐటీఐ కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. 22వ తేదీ తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరుకావాలని కోరారు.

డిజిటల్ క్లాస్ రూమ్‌ల పరిశీలన

చేజర్ల(సోమశిల): అనంతసాగరం జెడ్పీహెచ్ఎస్‌లోని డిజిటల్ క్లాస్ రూమ్‌లను సీడ్స్ స్వచ్ఛంద సంస్థ సీఈఓ సమీనా శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా స్కూల్లో 10వ తరగతిలో స్కూల్ ఫస్ట్ వచ్చిన ఇద్దరికి ప్రతి సంవత్సరం రూ.50 వేలు స్కాలర్‌షిప్ అందిస్తున్నామన్నారు. అనంతరం పాఠశాల హెచ్ఎం లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఏర్పాటు చేసిన చేసిన ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా అనంతసాగరం గ్రామానికి చెందిన చింతగుంట సుబ్బారెడ్డి ఈ డిజిటల్ క్లాస్ రూములకు సహకారమందించారన్నారు. ఈ క్లాస్ రూమ్‌ల ద్వారా అత్యుత్తమ భోజన అందిస్తున్నామన్నారు.

జీపుజాతాకు ఘన స్వాగతం

సంగం: జిల్లాలో విద్యారంగం, నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నిర్వహిస్తున్న జీపుజాతా శుక్రవారం సంగంకు చేరుకుంది. ఈ సందర్భంగా సంగం ఎస్ఎఫ్ఐ శాఖ జీపు జాతా యాత్రకు ఘన స్వాగతం పలికారు. సంగం ఆనకట్ట వద్ద నుంచి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లో సభ ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటరమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీహర్ష, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీపీయం నాయకులు తోక మురళీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్, ఎంపీడీఓలకు సన్మానం



సన్మానిస్తున్న మండల కన్వీనరు సుబ్బారెడ్డి

సీతారామపురం: తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఎంవీ సుధాకర్‌బాబు, ఎంపీడీఓ రంగసుబ్బరాయుడుకు మండలంలోని బసినేనిపల్లి సచివాలయంలో శుక్రవారం సన్మానం నిర్వహించారు. మండల కన్వీనరు చింతంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ మారుమూల మెట్ట ప్రాంతమైన సీతారామపురంలో రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనరు బాలినేని మాబయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అందరూ సమన్వయంతో పనిచేయాలి

సీతారామపురం: గృహసారథులు, వలంటీర్ల సమన్వయంతో ప్రతి ఇంటికెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ తిరిగి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలనే విషయాన్ని వారికి తెలియజేయాలని మండల జేసీఎస్ కన్వీనరు బాలినేని మాబయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని బసినేనిపల్లి సచివాలయంలో గృహసారథులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. మండల కన్వీనరు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, పంచాయతీ సచివాలయ కన్వీనరు తమ్మిశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

శ్రావణ శుక్రవార పూజలు

ఆత్మకూరు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ మాస చివరి శుక్రవారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేశారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. నిమ్మకాయల దీపాలు వెలిగించారు.